# స్వామినాథన్ కమీషన్ సిఫారసులు వద్దా? ఎఫ్.డి.ఐలు ముద్దా?

## వ్యవసాయ రంగంపై డా॥ జయప్రకాశ్ నారాయణ ఆలోచనలు ప్రమాదకరం

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో డా॥ జయప్రకాశ్ నారాయణ ఆంధ్రజ్యోతిలో నవంబర్ 27, 28 తేదీలలో "వ్యవసాయంలో వ్యూహాత్మక మార్పు", "రైతుల లబ్ధికే ఎఫ్.డి.ఐలు" అనే శీర్షికలతో తన అభిప్రాయాలను రాశారు. కొన్ని రోజుల క్రితమే భారతదేశంలోకి జన్యుమార్పిడి పంటలు రావలసిన ఆవశ్యకతను వివరిస్తూ, జన్యుమార్పిడి పంటల క్షేత్ర స్థాయి పరీక్షలపై నిషేధం విధించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, సుప్రీం కోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ ఏకగ్రీవంగా చేసిన సిఫారసులను నిరసిస్తూ పత్రికా విలేఖరుల సమావేశంలో ఒక పత్రాన్ని విడుదల చేశారు. ఇంకా కొద్దిగా వెనక్కు వెళ్ళి, తూర్పు గోదావరి జిల్లాలో గత సంవత్సరం రైతులు క్రాప్‌హాలిడే ప్రకటించిన సందర్భంలో ప్రభుత్వం ముందు ఆయన పెట్టిన కొన్ని డిమాండ్లూ వున్నాయి.

ఆంధ్రజ్యోతి వ్యాసంతో సహా, ఆయా సందర్భాలలో డా॥ జె.పి. వ్యవసాయ రంగ సమస్యలపై వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలూ, స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య పేరుతో ఆయన పెడుతున్న డిమాండ్లూ ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ అభిప్రాయాలూ, డిమాండ్లూ భారతదేశంలోని సన్న, చిన్నకారు రైతుల, మధ్య తరగతి రైతుల ప్రయోజనాలకు హానికరమైనవనీ, బహుళజాతి సంస్థల ప్రయోజనాలను కాపాడేవనీ.

నేను ఈ మాట అనగానే, కొంత మందికి ఉక్రోశం కలగవచ్చు. ఆయన వ్యక్తిత్వాన్నీ, నిజాయితీగా వుండి, అవినీతిపై గళమెత్తే ఆయన స్వభావాన్నీ కించపరిచానని వాళ్ళు భావించవచ్చు. రాజకీయ జీవితంలో వుండే వ్యక్తులూ, సంస్థలూ నిజాయితీగా వుండడం చాలా అవసరం. దానిని మనం కోరుకుంటాం. కానీ వ్యక్తి నిజాయితీగా వుండడం, అవినీతిని ప్రశ్నించడం వరకే పరిమితమై చూస్తే ఆయా వ్యక్తుల మొత్తం రాజకీయ జీవితాన్ని, కార్యాచరణను పూర్తిగా అంచనా వేయలేం. ఆ వ్యక్తి / సంస్థ "ప్రజలు కేంద్రంగా జరగాల్సిన అభివృద్ధి" విషయంలో ఎటువంటి భావాలు కలిగి వున్నారు? ఆ వ్యక్తి లేదా ఆ సంస్థ పెడుతున్న డిమాండ్లు, చేస్తున్న కార్యాచరణ ఏ సమూహ ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తుంది? అనేది కూడా నిర్దిష్టంగా చూడాలి. విశ్లేషించాలి. ఒక అంచనాకు రావాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలలో వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు నిష్కళంకులై, నిజాయితీగా, అవినీతికి దూరంగా ఉండాలని ప్రతిపాదిస్తూ మొదలైన డా॥ జె.పి. ప్రయాణం దేశ ఆర్థిక వ్యవస్థను, విధానాలను విశ్లేషించే సందర్భంలో మొదటి నుండీ గాడి తప్పింది. దేశ ప్రయోజనాలు, దేశ ప్రజలకు జీవనోపాధి, ఆదాయాల భద్రత, అందుకవసరమైన విధానాల రూపకల్పన కంటే, మొదటి నుండీ ఆయన దాడంతా ప్రభుత్వరంగ సంస్థలపై ఎక్కుపెట్టాడు. ఆంక్షలూ, నియంత్రణలూ, అవినీతి, ప్రజాపంపిణీ వ్యవస్థలూ, సబ్సిడీలూ, సంక్షేమ పథకాలూ, ఎగుమతి దిగుమతి విధానాలూ ఇవే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ భ్రష్టుపట్టడానికి కారణమన్నట్లుగా విశ్లేషించాడు. ఆయన ఆంధ్రజ్యోతి వ్యాసంలో రాసినట్లుగా "స్వల్ప కాలికంగా గానీ, దీర్ఘకాలికంగా గానీ స్వేచ్ఛావాణిజ్యం ద్వారానే సరుకుల సరఫరా అవరోధాలు లేకుండా ఖచ్చిత స్థాయిలో జరుగుతుందని" విశ్వసిస్తున్నాడు. ఆయన దృష్టిలో భారతదేశంలో గొప్ప, ఏకైక ఆర్థిక వేత్త డా॥ మన్మోహన్‌సింగ్. డా॥ మన్మోహన్ ఆర్థిక విధానాలు మాత్రమే ఈ దేశానికి సరైనవని ఆయన ప్రగాఢ నమ్మకం. (ఆ ఆర్థిక విధానాలు సరైనవని అనుకున్నప్పుడు, కాంగ్రెస్‌లోనే చేరకుండా ఒక ప్రత్యేక పార్టీని ఎందుకు నడిపిస్తున్నారని అనుమాన పడకండి)

1991 నుండీ ముందు వచ్చిన సరళీకరణకు ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఆయనకు ఎటువంటి పేచీలేదు. ఆయన పేచీఅల్లా ఈ సంస్కరణలు మరింత వేగంగా ముందుకు వెళ్ళకుండా అడ్డుపడుతున్న "అభివృద్ధి నిరోధక పార్టీలు, ప్రజా ఉద్యమాల" వైఖరి మీద.

డా॥ జయప్రకాశ్ నారాయణ ఆలోచనల గురించి ఇంత సుదీర్ఘంగా ఎందుకు ప్రస్తావించవలసి వచ్చిందంటే, ఆయన గత కొంత కాలంగా స్వతంత్ర రైతు సంఘాల అధ్యక్షుడిగా కూడా వున్నారు.. (లోక్‌సత్తా **పార్టీ** అధ్యక్షుడు, **స్వతంత్ర** రైతు సంఘాల అధ్యక్షుడేమిటని మళ్ళీ మరోసారి అనుమానపడకండి!) వ్యవసాయ రంగంపై మాట్లాడడం ప్రారంభించారు. కొన్ని కొత్త డిమాండ్లు ముందుకు తెస్తున్నారు. ఆ డిమాండ్ల స్వభావం అత్యంత ప్రమాదకరమైనది. డా॥ జె.పి. ప్రతిపాదనలను సకాలంలో, సరైన పద్ధతిలో తిప్పికొట్టకపోతే, ఆయన నిజాయితీ పరుడని విశ్వసిస్తూ, ఆయన వెంటనడుస్తున్న వారూ, సమాజం గురించి బాధ్యతగా ఆలోచించే అనేక మంది యువతీ, యువకులు వ్యవసాయ రంగ సమస్యల గురించి మరింత గందరగోళంలో పడిపోయే ప్రమాదం వుంది. డా॥ జె.పి గొంతును వాడుకుని బహుళజాతి కంపనీలు ఈ దేశ, రాష్ట్ర వ్యవసాయ రంగంపై మరింత పట్టును బిగించే ప్రమాదమూ వుంది.

“వాస్తవానికి వ్యవసాయ రంగంలో ప్రభుత్వాల ఘోరమైన తప్పిదాలు ఉత్పత్తి రంగంలో కంటే ధరల ఈ రంగంలో వున్నాయి”. ఇది జె.పి. మాట. ఆయన ఆలోచనలోని ప్రధాన లోపమిదే.

వ్యవసాయ రంగ సమస్యలను చర్చించాలంటే ముందుగా ఉత్పత్తిరంగం నుంచి ప్రారంభించాలి. ఎందుకంటే రైతు ఇబ్బందిపడుతున్నది ముందుగా అక్కడే. పంట పండాక కదా, అమ్ముకునేది!

1. వ్యవసాయమే జీవనాధారంగా ఎంచుకునే రైతుకు ముందుగా సాగు భూమి వుండాలి. కానీ మనరాష్ట్రంలో సాగు భూమి వ్యవసాయేతర అవసరాలకూ, వ్యవసాయేతరుల చేతుల్లోకీ వేగంగా వెళ్ళిపోతున్నది. అత్యధిక మంది సాగుదారులు కూడా సన్న, చిన్నకారు రైతులే. కొత్తగా సాగు చేయాలనుకుంటున్న వారు అనివార్యంగా కౌలుదారులుగా మారవలసివస్తున్నది. మన రాష్ట్రంలో సుమారు 30 లక్షల కౌలు రైతు కుటుంబాలున్నాయని ప్రభుత్వమే చెబుతోంది. ఈ కౌలు రైతులెవ్వరికీ ఏ విధమైన సంస్థాగత సహాయమూ అందడం లేదు. కౌలు ధరలపై నియంత్రణ కూడా లేదు. పంట నష్టపోతే పరిహారమూ అందడం లేదు.

   ఈ కౌలు రైతులూ, సన్న, చిన్న కారు రైతులతో దేశం బాగుపడదని డా॥ జె.పి. నమ్ముతున్నారల్లే వుంది. అందుకే ఏనాడూ వీరి సమస్యలు ప్రస్తావించరు.

2. విత్తనం రైతు హక్కు. కానీ హరిత విప్లవం పుణ్యమా అని స్థానిక రకాల వైవిధ్యం అంతరించిపోయి, అధిక ఉత్పత్తినిస్తాయనే పేరుతో హైబ్రిడ్లు వచ్చాయి. ప్రతి సీజన్‌లోనూ, ప్రతి పంట కోసమూ రైతు విత్తనం కోసం కంపనీల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాన్ని రైతుకు అందించే బాధ్యత నుండి తప్పుకుని, స్వేచ్ఛామార్కెట్ పేరుతో కంపనీలకు రంగాన్ని వదిలేసింది. విత్తనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కల్తీ విత్తనాలు రాజ్యమేలుతున్నాయి.

   డా॥ జె.పి. అమితంగా ఇష్టపడే జన్యుమార్పిడి బీటీ పత్తి విత్తనం రైతుల నడ్డి ఎలా విరుస్తున్నదో అందరూ అనుభవిస్తున్నదే. ఒక్క జన్యువుపై పేటెంట్‌తో మాన్‌శాంటో కంపనీ, పత్తిపంటపై, పత్తి విత్తనంపై గుత్తాధిపత్యాన్ని సాధించింది. 450 గ్రా॥ల పాకెట్‌కు ప్రభుత్వం 930 రూ॥ల ధర నిర్ణయిస్తే, వ్యాపారులు, కంపనీలు దానిని 2000 నుండి 3000 రూ॥లకు అమ్ముకుంటున్నారు. (ఈ ప్రైవేట్ కంపనీలు లాభాపేక్ష లేకుండా రైతులకు నాణ్యమైన సేవ అందిస్తాయని డా॥ జె.పి. నమ్మకం) మిగిలిన పంటల్లోనూ జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెడితే, అప్పుడు ఆ విత్తనాల కంపెనీల దయాదాక్షిణ్యాల మీదే భారత వ్యవసాయ రంగం ఆధారపడాల్సి వస్తుందన్న “సామాన్య జ్ఞానం” కూడా డా॥ జె.పి.కి ఎందుకు అందడం లేదు?

3. భూసార పరిరక్షణ అనేది రైతు వ్యక్తిగత బాధ్యత అయిపోయింది. భూసార పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏరకమైన సహాయమూ అందించడం లేదు. రసాయన ఎరువుల వాడకం భూసారాన్ని దెబ్బతీస్తున్నదని నివేదికలు చెబుతున్నాయి. ఇంత కాలం రసాయన ఎరువులకిచ్చిన సబ్సిడీ పై కూడా ప్రభుత్వం పరిమితి విధించింది. దీంతో డి.ఏ.పి, ఇతర

కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. గత సంవత్సరం 450 రూ॥లున్న డి.ఏ.పి బస్తా ధర ఈ సంవత్సరం 1250 రూ॥లకు చేరింది. పైగా ఆ ఎరువులూ సకాలంలో అందడం లేదు. రసాయన ఎరువుల వాడకం మానేసి సేంద్రియ ఎరువుల వాడకం చేద్దామన్నా, అందుకు ప్రభుత్వం నుండి రైతుకు అందే సహాయం శూన్యం. ప్రభుత్వం ఎరువుల సబ్సిడీలను ఉపసంహరిస్తే, తక్షణం నష్టపోయేది రైతేనన్న విషయం డా॥ జె.పికి అర్థం కాకపోయినా, సాధారణ రైతులకు తెలుసు.

4. పురుగు మందుల ఖర్చు వ్యవసాయంలో ముఖ్యమైన ఖర్చే. పైగా ఈ విషపూరిత రసాయన పురుగు మందులు విధ్వంసకరమైన పర్యావరణ ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి. గాలినీ, నీటినీ, భూమినీ కలుషితం చేస్తున్నాయి. ఈ పురుగు మందుల వినియోగం తగ్గించాల్సిన అవసరం తక్షణమే ఉందనీ, అందుకు ప్రత్యామ్నాయాలు వెదకాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందనీ డా॥ జె.పి. ఏనాడూ ఎలుగెత్తి మాట్లాడరు. "ప్రజల భాగస్వామ్యంలో సుస్థిర వ్యవసాయం" ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్ద ఎత్తున సాగుతున్నా, దానిని పరిశీలించరు. గుర్తించరు. దాని పట్ల నేర సమానమైన మౌనాన్ని వహిస్తారు. పైగా పురుగు మందులకంటే ప్రమాదకరమైన బీటీ విషాన్ని, అన్ని పంటలలోనూ చొప్పించే ప్రయత్నం చేస్తుంటే దాన్ని సమర్థిస్తారు. జన్యుమార్పిడి పంటలతో వచ్చే సమస్యలపై ప్రపంచవ్యాపితంగా అనేక శాస్త్రనివేదికలు వెలువడుతున్నా వాటిని అధ్యయనం చేయరు. దానిపై కృషి చేస్తున్న శాస్త్రవేత్తలతో చర్చించరు. ఆ పంటలు భారతదేశానికి అత్యవసరమని మాత్రం ప్రకటించేస్తారు.

5. కౌలు రైతులతో సహా రైతులందరికీ పంటసాగుకు అవసరమైన పంటరుణాలను అందించడం ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రధాన బాధ్యత. బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో సంస్థాగత రుణ సౌకర్యం పొందుతున్న వారి సంఖ్య మొత్తం సాగుదారులలో 20 శాతం దాటడం లేదు. మిగిలిన సాగుదారులందరూ రుణాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడుతున్నారు. ఎక్కువ వడ్డీలు చెల్లిస్తున్నారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది కౌలు రైతులలో కేవలం 80 వేల మందికే ఈ సంవత్సరం రుణాలందాయి. వీరికి 2000 కోట్ల రూపాయల రుణాలివ్వాలని టార్గెట్ పెట్టుకుని ఇచ్చింది మాత్రం 130 కోట్ల రూపాయలు. పంటల ఉత్పత్తిలో సకాలంలో రైతుకు అందే పంటరుణం కీలకపాత్ర పోషిస్తుందన్నది డా॥ జె.పి. దృష్టికి రాలేదేమో! ఆయన ఎప్పుడూ ఈ అంశంపై జరిగిన చర్చలకు దూరంగానే ఉన్నారు.

6. సంస్థాగత రుణాలు పొందిన రైతులకే బీమా సౌకర్యం అమలవుతున్నది. మిగిలినవారంతా ప్రకృతి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి పంటలు వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీగా ప్రభుత్వం ఇచ్చేది ఎకరానికి 2400 రూ॥లు.

రైతులకు రుణాలు, బీమా, పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించే బాధ్యత ప్రభుత్వానికి వుందని డా॥ జె.పి. ఏనాడూ ప్రధాన డిమాండ్‌గా ముందుకు తీసుకురారు. దానిపై ఉద్యమాలు నిర్మించరు.

7. అప్పుల భారం కారణంగా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా, ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా, మనోవ్యధకు గురై రైతులు ఆత్మహత్య చేసుకున్నా డా॥ జె.పి. చలించరు. 1995 నుండీ 2011 వరకూ గత 17 సంవత్సరాలలో దేశవ్యాపితంగా 2,73,000 మంది, మన రాష్ట్రంలో 33 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఆయన స్పందించరు. ఆయా కుటుబాల పట్ల బాధ్యతతో డిమాండ్లు చేయరు. ఉద్యమాలు నిర్మించరు. బహుశా అంతరించిపోతున్న జీవజాతులలో సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు చేరారానీ, ఇది అనివార్య పరిణామమనీ ఆయన భావిస్తున్నారేమో!

8. రైతులకు క్షేత్ర స్థాయిలో అత్యవసరమైనది వ్యవసాయ విస్తరణ వ్యవస్థ. పంటల ఎంపిక, విత్తన సరఫరా, సస్యరక్షణ సూచనలు, వ్యవసాయరంగంలో ప్రభుత్వ పథకాల అందుబాటు, వాతావరణ ఆధారిత సాగు సూచనలు,

మార్కెటింగ్‌లో అవకాశాలు, ప్రతికూలతలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సహాయం తదితర విషయాల్లో నిత్యం అందుబాటులో వుండి రైతులకు భరోసా ఇవ్వవలసింది వ్యవసాయ విస్తరణ అధికారులే. ప్రస్తుతం ప్రభుత్వ రంగ విస్తరణ వ్యవస్థ అత్యంత బలహీనంగా వుంది. మొత్తం రాష్ట్రంలో మండల క్షేత్ర స్థాయిలో పనిచేసే వ్యవసాయ అధికారులు 5 వేలమందికి మించి లేరు. రైతులు వ్యవసాయ సంబంధిత సమాచారం, సలహాల కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపుల యజమానుల మీద ఆయా కంపనీల ఏజంట్ల మీద ఆధారపడుతున్నారు. వారు వ్యాపార ధోరణితో, తమ ఉత్పత్తుల అమ్మకం లక్ష్యంగా సలహాలు ఇస్తున్నారు. రైతులను ప్రలోభపెడుతున్నారు. మన రాష్ట్రంలో పత్తిపంటకు సాగుయోగ్యమైన భూమి 15 లక్షల ఎకరాలకు మించి లేదు. కానీ ఈ సంవత్సరం 55 లక్షల ఎకరాలకు పత్తి సాగు వెళ్ళింది. ప్రభుత్వం పత్తి విత్తన కంపనీలకు లైసెన్సు ఇచ్చి మౌనంగా వుంది. క్షేత్ర స్థాయిలో రైతులకు వాస్తవ స్థితిపై అవగాహన, చైతన్యం కలిగించే విస్తరణ వ్యవస్థ లేదు. దీని వల్ల లాభపడింది ప్రైవేటు విత్తన కంపనీలు, వ్యాపారులు. నష్టపోయింది, ఆత్మహత్య చేసుకుంటున్నది పత్తి రైతులు.

మొత్తం మన రాష్ట్రంలో పంటల వైవిధ్యం తగ్గిపోయి కేవలం వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలే 80 శాతం సాగు భూమిని ఆక్రమించాయంటే క్షేత్ర స్థాయిలో విస్తరణలో వ్యవస్థ వైఫల్యం, ప్రభుత్వ విధానాల లోపభూయిష్టత ఏ స్థాయిలో వున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పంటల ఉత్పత్తి క్రమంలో అత్యవసరమైన ఈ విస్తరణ వ్యవస్థ గురించి డా॥ జె.పి. ఏనాడూ మాట్లాడరు. నిర్దిష్ట పరిష్కారాలూ సూచించరు.

9. మనరాష్ట్రం ఇప్పటికీ ప్రధానంగా వర్షాధార సాగుభూములున్న ప్రాంతం. ఈ ప్రాంతాల ప్రత్యేక సమస్యల గురించి డా॥ జె.పి ఏనాడూ ప్రస్తావించరు. నిర్దిష్ట డిమాండ్లు చేయరు. ఉద్యమాలూ నిర్మించరు. వాస్తవానికి వర్షాధార ప్రాంతాల్లోనే పంటల వైవిధ్యం ఎక్కువ. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు జరుగుతున్నది ప్రధానంగా ఈ ప్రాంతాలలోనే. ఆయా పంటలకు మద్ధతు ధరలూ లేవు. ప్రభుత్వం సేకరణా చేయదు. దీని వల్లనే పోషక విలువలు నిండిన చిరుధాన్యాల, పప్పు ధాన్యాల విస్తీర్ణం తగ్గించుకుంటూ రైతులు అనివార్యంగా బీటీ పత్తి వైపు మొగ్గుతున్నారు.

బీటీ పత్తి సాగు కోసం ప్రతి రైతూ ఒకటికి మించి బోర్లు వేస్తున్నాడు. సాంప్రదాయక చెరువుల, కుంటల వ్యవస్థ ధ్వంసమై పోవడంతో, సాగు నీటి కోసం రైతే స్వయంగా లక్షల రూపాయలు పెట్టుబడి పెడుతున్నాడు. కనీసం నాణ్యమైన ఉచిత విద్యుత్తును కూడా ప్రభుత్వం అందించలేకపోవడం వల్ల, విద్యుత్ కోతలు, మోటర్లు కాలిపోవడం, మొత్తం భూమి సాగు చేయలేకపోవడంతో క్రమంగా ఈ ప్రాంతాల్లో పంటల దిగుబడి తగ్గిపోతున్నది. రైతు కుటుంబాల ఆదాయాలు పడిపోయి అప్పులు పెరుగుతున్నాయి. బీటీ పత్తి రైతుల ఆత్మహత్యల సంఖ్య మొత్తం రైతు ఆత్మహత్యల్లో 95 శాతం.

సాగునీటి వనరులున్న ప్రాంతాల సమస్యల గురించీ, అక్కడ పంటల ఉత్పత్తిలో మిగులు గురించీ, ఆ మిగులును ఎగుమతి చేసి లాభాలు సంపాదించడం గురించీ తప్ప డా॥ జె.పి. ఏనాడూ వర్షాధార ప్రాంతాల పంటలు, రైతుల సమస్యల గురించి మాట్లాడలేదు. డిమాండ్లు రూపొందించలేదు. ఉద్యమాలు సాగించలేదు.

10. ఒక దేశ వ్యవసాయరంగం బాగుపడాలంటే, రైతుల జీవితాలు బాగుపడాలంటే, ఆ దేశ ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో పెట్టుబడులు భారీగా పెట్టాలి. రైతులు పంటలు పండించేందుకు అవసరమైన మద్ధతు వ్యవస్థలను సంపూర్ణంగా నిర్మించాలి. అందుకనుగుణంగా నిధులను కేటాయించాలి. వ్యవసాయ ఉత్పత్తి రంగంలో ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తే, తక్షణం భారమంతా మోయవలసిన బాధ్యత రైతులదే అవుతుంది. విస్తరణ వ్యవస్థ, భూసార పరిరక్షణ, నాణ్యమైన విత్తనాల అందుబాటు, మౌలిక సౌకర్యాల కల్పన (రోడ్లు, విద్యుత్ సరఫరా,

గోదాములు, మార్కెట్ యార్డుల నిర్మాణం) కోసం ప్రభుత్వం భారీగా నిధులను వెచ్చించవలసి వుంటుంది. చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు, ప్రజల్ని నిర్వాసితుల్ని చేయని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మాణం చేసి సాగునీటి వనరులను అభివృద్ధి చేయడం, భూమిపై పడిన ప్రతి వర్షపు చుక్కనూ నిల్వ చేసుకుని, పొదుపుగా వాడుకునే సాగునీటి వ్యవస్థలను రూపొందించడం కూడా ప్రభుత్వాల బాధ్యతే. అనివార్యమైన చోట ఎత్తి పోతల పథకాలు ప్రారంభించినా, వాటి నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా అందించడం కూడా ప్రభుత్వాల బాధ్యతే.

వాస్తవానికి ఇవన్నీ పంటల ఉత్పత్తి క్రమంలో మొదటి మెట్లు. అనివార్యంగా వేయవలసిన మొదటి అడుగులు. ఈ దశలో ప్రభుత్వం ఎంత బాధ్యతగా వుంటే రైతు అంత ఉత్సాహంగా సాగుకు సిద్ధమవుతాడు. అద్భుతమైన పంటలను పండిస్తాడు.

అమెరికాలోనైనా, యూరోపియన్ దేశాల్లో నైనా, స్వేచ్ఛా మార్కెట్ ప్రభవించిందనుకుంటున్న చైనాలోనైనా, ఆయా దేశాల ప్రభుత్వాలు ఈ పనే చేశాయి. కోట్ల కొద్దీ డాలర్లను, యూరోలను, యెన్‌లను రైతులకు (అమెరికాలో అయితే కంపనీలకు) ఉత్పత్తి క్రమంలో సబ్సిడీలుగా ఇచ్చాయి. వివిధ రకాల సహాయ పథకాలను ప్రకటించి అమలు చేశాయి.

ఏ దేశంలోనూ ప్రభుత్వాల సహాయం లేకుండా రైతులు తక్కువ పెట్టుబడితో పంటలు పండించలేరు. ఈ విషయాన్ని ముందుగా డా॥ జె.పి. గుర్తించాలి. విషాదకర వాస్తవమేమంటే, మన దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉత్పత్తి క్రమంలో రైతుకు అందించాల్సిన మద్ధతు గురించి మర్చిపోయాయి. పూర్తిగా ఆ బాధ్యత నుండి తప్పుకున్నాయి. అనివార్యంగా రైతే ఆ మొత్తం భారాన్ని మోయవలసి వస్తున్నది. దాని వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి, అప్పులపాలు కావలసి వస్తున్నది.

పై సమస్యలన్నీ డా॥ జె.పి. తక్కువ ప్రాధాన్యత గల సమస్యలుగా భావిస్తున్నారు. మరింత సూటిగా వాదనకు దిగితే, పై సమస్యల తీవ్రతను ఆయన అంగీకరించవచ్చు. అసలు విషయం ఆయా సమస్యలనుండి బయటపడేందుకు ఆయన సూచిస్తున్న పరిష్కారాలు. సమస్య తీవ్రతకంటే అవి మరింత ప్రమాదకరమైనవి. వీటితో సమస్యలు పరిష్కారం కాకపోగా, మొత్తం వ్యవసాయరంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి. రైతులను సాగు నుండి, మొత్తంగా వారి భూముల నుండి బేదఖలు చేస్తాయి. బహుళజాతి సంస్థల పెత్తనాన్ని భారత వ్యవసాయ రంగంపై, భారత ఆర్థిక వ్యవస్థపై మరింత స్థిర పరుస్తాయి.

2011లో తూర్పు గోదావరి జిల్లా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించిన సందర్భంగా డా॥ జె.పి. సమస్య పరిష్కారానికి 2 ప్రధాన డిమాండ్లు లేవనెత్తారు.

1. బియ్యం ఎగుమతులపై ఆంక్షలు ఎత్తి వేయాలని, 2. రాష్ట్ర వ్యాపితంగా అన్ని గ్రామాల్లో వ్యవసాయంలో భారీగా యంత్రీకరణను ప్రవేశపెట్టాలని.

దేశ ఆహార భద్రత కోసం జన్యుమార్పిడి పంటలను భారతదేశంలో ప్రవేశపెట్టాలని గట్టిగా కోరుతున్న వ్యక్తిగా డా॥ జె.పి. ఇటీవల CIFA నాయకుడు చెంగలరెడ్డితో కలసి మీడియా ముందుకొచ్చారు.

భారతదేశ రిటైల్ రంగంలోకి ఎఫ్.డి.ఐ.లను అనుమతించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బలంగా స్వాగతించి, సమర్ధించిన వ్యక్తి డా॥ జె.పి.

పై అభిప్రాయాలూ, డిమాండ్లూ పరిశీలిస్తే డా॥ జె.పి. దృష్టిలో రైతు అంటే ఎవరు? అన్న ప్రశ్న తలెత్తక మానదు.

ఉత్పత్తి క్రమంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఆయనకు పెద్ద పట్టింపు లేదు. వాటిపై ఆయన ఎప్పుడూ గట్టిగా మాట్లాడలేదు. ప్రభుత్వాలతో పోట్లాడలేదు.

పంటలు పండి (ముఖ్యంగా ధాన్యం) కోత కొచ్చాక మాత్రమే ఆయన కార్యాచరణ మొదలవుతుంది. మరీ స్పష్టంగా చెప్పాలంటే ధాన్యం పూర్తిగా రైతుల చేతుల్లోంచి మిల్లర్ల చేతికి చేరాక మాత్రమే ఆయన డిమాండ్లు మొదలవుతాయి.

బియ్యం రవాణాపై, ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేయడం ఆయన ఏకైక డిమాండ్ అవుతుంది. ఆంధ్రజ్యోతిలో నవంబర్ 28న ఆయన రాసిన రెండవ భాగంలో ఈ సమస్యపై ఆయన చేసిన సత్యాగ్రహ పోరాటాన్ని కూడా సోదాహరణంగా వివరించారు. కాకపోతే ఈ సందర్భంలో ఆయన జవాబు చెప్పవలసిన ప్రశ్నలు మిగిలేవున్నాయి. ఆయన సత్యాగ్రహ పోరాటం తర్వాత, ఎంత మంది రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధరలు అందాయి? ఎంత మంది రైతులు సరిహద్దులు దాటివెళ్ళి ధాన్యం అమ్ముకుని లాభాలు గడించారు? విదేశాలకు బియ్యం ఎగుమతి చేసిన ఎంత మంది వ్యాపారులు తమకొచ్చిన లాభాల్లో వాటాలను ఎంతమంది రైతులకు పంచారు? ప్రతి సంవత్సరం ఖరీఫ్ చివరిలో, ధాన్యం మిల్లర్ల చేతికి చేరాక మాత్రమే డా॥ జె.పి. రైతు నాయకుడి అవతారం ఎందుకు ఎత్తుతారు? ఆయన దృష్టిలో రైతులంటే మిల్లర్లు, ఎగుమతి వ్యాపారులేనా?

వ్యవసాయం అంటే రైతులు, వ్యవసాయ కూలీలు ఉమ్మడిగా సాగించే ఒక కృషి. తరతరాలుగా ఈ రెండు సమూహాల జీవనోపాధికి ఆధారం ఆ కృషి. ఇది ఒక సామాజిక పొందిక. దీన్నంతా విచ్ఛిన్నం చేస్తూ, మొత్తం వ్యవసాయ పనులలో యంత్రాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేయడం డా॥ జె.పి. విచక్షణా జ్ఞానంమీదే సందేహాలు కలిగించింది. ఆధునిక యంత్రాలు వ్యవసాయంలో ప్రవేశించాక, ఉత్పత్తి ఖర్చులు ఏ మేరకు తగ్గించాయో తెలవదు కానీ, కూలీల ఉపాధికీ, పశుసంపదకూ, పర్యావరణానికీ తీరని హాని చేశాయి. పెద్ద యంత్రాలు భూమిని మరింత గట్టిబరిచాయి. పశువుల మేత కరువైంది. విద్యుత్ ఛార్జీలు, డీజిల్ ధరలు రోజురోజుకీ పెరుగుతున్న దశలో యంత్రాల కిరాయిలు రైతుపై మోయలేని భారాన్ని మోపుతాయి. విచక్షణారహితంగా బ్యాంకులు ట్రాక్టర్ల కోసం ఇచ్చిన రుణాలు చాలా మంది రైతులను అప్పుల ఊబిలో దించాయి. భారీ యాంత్రీకరణ విధ్వంసానికి పంజాబ్, హర్యానా రాష్ట్రాలు పెద్ద ఉదాహరణగా నిలుస్తాయి. హార్వెస్టర్లతో పంటలు కోయించి, తర్వాత ఆ పంట మిగులును తగుల బెట్టడం వల్ల, ఎన్ని వందల కోట్ల రూపాయల విలువైన పోషకాలు నష్టపోతున్నామో, పర్యావరణంలోకి ఎంత భారీ స్థాయిలో కర్బన ఉద్గారాలు వదులుతున్నామో డా॥ జె.పి. మేధస్సుకు అంతు పట్టడం లేదా? దీర్ఘదృష్టిలేని ఈ డిమాండ్లు రైతుల కోసమా? యంత్రాలు అమ్ముకునే పరిశ్రమల కోసమా?

రైతుల, వ్యవసాయ కూలీల సహకార సంఘాలు నిర్మించి, ఆయా సంఘాల ఆధ్వర్యంలో అవసరమైన యంత్రాలు వుంచి, వారు ఉమ్మడిగా వ్యవసాయం చేసుకునేందుకు ఏది మెరుగైన మార్గమో ఆలోచించాల్సిన బాధ్యత డా॥ జె.పి.కి లేదా?

మరో ఆసక్తికరమైన విషయమేమంటే డా॥ జె.పి.తనకు తాను ఒక గొప్ప ప్రజాస్వామిక వాదిగా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని అన్ని వ్యవస్థలపట్ల సంపూర్ణ విశ్వాసమున్న వ్యక్తిగా చెప్పుకుంటారు. భారతదేశ గొప్పతనమంతా ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టుకోవడంలోనే వుందని చెబుతారు. కానీ, వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసే సూచనలు అన్నీ అత్యంత అప్రజాస్వామికమైనవి.

ఆయనకు ప్రభుత్వం మీద నమ్మకం లేదు. ప్రభుత్వ రంగ సంస్థల మీద నమ్మకం లేదు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల మీద నమ్మకం లేదు. సుప్రీంకోర్టు నియమించే సాంకేతిక నిపుణుల కమిటీల మీద నమ్మకం లేదు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ రైతు కమీషన్ నివేదికలమీదా నమ్మకం లేదు.

ఆయన బాగా నమ్ముతున్నది ప్రైవేట్ వాణిజ్య, పారిశ్రామిక సంస్థలను, మరీ ముఖ్యంగా బహుళజాతి కంపనీలను. రైతుల లబ్ధికే ఎగుమతులని, రైతుల లబ్ధికే జన్యుమార్పిడి పంటలని, రైతుల లబ్ధికే ఎఫ్.డి.ఐ.లని, రైతుల లబ్ధికే యాంత్రీకరణ అని, రైతుల లబ్ధికే స్వేచ్ఛావాణిజ్యమని ఆయన చెబుతున్నారు.

అందుకోసం ఆయన సూచించేది "ఎఫ్.సి.ఐ ని మూసేయాలి. ప్రభుత్వ విత్తన సంస్థలను మూసేయాలి. ప్రభుత్వమే మొత్తంగా ప్రక్కకు తప్పుకుని, రంగాన్ని పూర్తిగా స్వేచ్ఛామార్కెట్ శక్తులకు వదిలెయ్యాలి". ధరల నియంత్రణ, ఎగుమతి, దిగుమతులు, సరుకుల పంపిణీ అన్నీ ఆయా ప్రైవేటు కంపనీలే బాగా నైపుణ్యంగా, బాగా సమర్ధంగా చేస్తాయని ఆయన బలమైన అభిప్రాయం.

ఆయన అభిప్రాయం ప్రకారం ఈ దేశంలో పార్టీలున్నది, ప్రభుత్వాలున్నది, అధికారులున్నది, కేవలం అవినీతిలో మునిగి తేలడానికే. కాసేపటికి ఆయన వాదనను అంగీకరిద్దాం. కానీ ప్రత్యామ్నాయంగా ఆయన సూచిసున్నది–అవినీతికి తావులేని నూతన పాలనావ్యవస్థను, ప్రజలకు నిజమైన అధికారాలను ఇచ్చే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను కాదు. వాల్‌మార్ట్, మాన్‌శాంటో లాంటి వారి చేతుల్లో నిర్మితమయ్యే కంపనీల రాజ్యాన్ని.

ప్రపంచ చరిత్రలో – కంపనీలెప్పుడూ వ్యాపారం కోసమే వస్తాయి. లాభాల కోసమే పనిచేస్తాయి. వాటికి దేశ భక్తి చాలా తక్కువ. కేవలం మార్కెట్ల విస్తరణపై ఆపేక్ష ఎక్కువ. ఈస్టిండియా కంపనీ నుండి ఈనాటి వరకూ అన్ని కంపనీల స్వభావం ఒక్కటే.

వీళ్ళు ప్రపంచంలో ఏ దేశాలలోనూ, ఆయా దేశాల ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. వాళ్ళు మూలుగులను పీల్చి పిప్పి చేయడం తప్ప, వాళ్ళ సహజ వనరులను, ఉత్పత్తులను దోచుకోవడం తప్ప. చౌక ముడి సరుకులు, చౌక శ్రమ దొరికినన్నాళ్ళూ అక్కడ వుంటారు. ఆయా దేశాల జీవ వైవిధ్యాన్ని దోచుకోగలిగినంతగా దోచుకుంటారు. వాటిపై పేటెంట్లు తెచ్చుకుంటారు. తిరిగి ఆయా దేశాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం పేరుతో వాటిని అమ్ముకుని రాయల్టీలు గుంజుకెళతారు.

డా॥ జె.పి. బాగా చదువుకున్న వ్యక్తి అని కొంత మందైనా నమ్ముతారు. కానీ బహుళజాతి కంపనీలు, మనదేశానికి, మన రైతులకు మేలు చేయడానికి రాలేదన్న సామాన్య జ్ఞానాన్ని ఆ చదువులు ఆయనకెందుకు ఇవ్వలేక పోయాయన్నదే ప్రశ్న. వాల్‌మార్ట్, మోన్‌శాంటో కంపనీల చరిత్ర అంతా నివేదికల నిండా నిక్షిప్తమై వుంది. అందుకే వాటి వివరాల జోలికి నేను వెళ్ళడం లేదు.

రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నది జగమెరిగిన సత్యమే. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలూ, సిఏసిపి లాంటి సంస్థలూ, అందరికందరూ, ఈ విషయంలో రైతుకు అన్యాయమే చేస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వం డా॥ ఎం.ఎస్.స్వామినాథన్ నేతృత్వంలో నియమించిన జాతీయ రైతు కమీషన్ సాధికారికంగా ప్రకటించి నివేదిక ఇచ్చింది. మద్దతు ధరల విషయంలో ఒక ముఖ్యమైన సూచన కూడా చేసింది. పంటల ఉత్పత్తి ఖర్చుకు మరో 50 శాతం కలిపి, కనీస మద్ధతు ధరగా నిర్ణయించి, రైతుకు చెల్లించాలని ఆ సూచన సారాంశం.

రైతు నాయకుడిగా ప్రకటించుకునే డా॥ జె.పి. మొత్తం తన వ్యాసంలో డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ నివేదిక గురించి కానీ, మద్ధతు ధరల విషయంలో ఆయన చేసిన సిఫారసు గురించి కానీ ప్రస్తావించలేదు. ఇది ఏదో ఆసంకల్పితంగా దొర్లిన పొరపాటు కాదు. చాలా మెలకువతో, చాలా చైతన్యయుతంగా వుండి చేసిన చర్య. కారణం స్పష్టమే.

ఈ వ్యాఖ్యకు పెట్టిన శీర్షిక వాస్తవానికి నేను పెట్టింది కాదు. ఈ రాష్ట్రంలో రైతుల సమస్యలపై పోరాడుతున్న ఒక నాయకుడు బ్యానర్ రూపంలో సంధించిన ప్రశ్న అది. ఆ బ్యానర్‌ను ఆయన ఇటీవల ఒక సమావేశం దగ్గర ప్రదర్శించారు. జన్యుమార్పిడి పంటలు, ఎఫ్.డి.ఐల ఆవశ్యకతను వివరిస్తూ డా॥ జె.పి., చెంగల్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశం

అది. మన రైతు నాయకుడు సమావేశం వేదిక మీద వుండగానే, నిర్వాహకులు ఆ బ్యానర్‌ను తొలగించారు. వాళ్ళు ఆ బ్యానర్‌ను తొలగించగలిగారు గానీ ఆయన సంధించిన ప్రశ్నను ఎలా రూపుమాపగలరు?

స్వామినాథన్ కమీషన్ సిఫారసు, పంటలు పండించే రైతులకు మేలు చేస్తుంది. ఆ సిఫారసును కేంద్ర ప్రభుత్వం ఆమోదించి కనీస మద్ధతు ధరలు నిర్ణయిస్తే, అది స్వేచ్ఛావాణిజ్యం, ఎఫ్.డి.ఐల పేరుతో వచ్చిన వాల్‌మార్ట్ లాంటి కంపనీలకు, రిటైల్ చైన్స్ నడుపుతున్న కార్పోరేషన్స్‌కు హాని చేస్తుంది.

అందుకే డా॥ జె.పి, స్వామినాథన్‌నూ మర్చిపోయారు. ఆయన చేసిన సిఫారసునూ వదిలేశారు. రైతుల లబ్ధికే ఎఫ్.డి.ఐలని కొత్త నినాదం అందుకున్నారు. ఆయా కంపనీలు మార్కెట్‌లో ప్రవేశించి, రైతుల మీద ప్రలోభాలు ప్రయోగించి, అవసరమైతే కార్టెల్‌గా రూపొంది, పంటల ఉత్పత్తులను సేకరిస్తాయి. ప్రాసెసింగ్ చేసుకుని తమకిష్టమైన ధరకు అమ్ముకుంటాయి. అందుకే వారికి, చట్ట బద్ధమైన మద్ధతు ధరలు వుండడం ఇష్టమందదు. సిమెంటు కంపనీలనూ, టెలికం కంపనీలనూ, విత్తన కంపనీలనూ వాటి గిమ్మికులనూ మనం చూశాం. వాళ్ళు అందించే నాణ్యత ఎంతో, వాళ్ల నమర్ధత ఎంతో కూడా అనుభవించాం. సహజ వాయువు ధరలను పెంచేందుకు రిలయెన్స్ ఆడుతున్న నాటకాలనూ చూస్తున్నాం.

ప్రభుత్వం బాగా లేకపోతే మంచి ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం. పాలన బాగా లేకపోతే, మంచి పాలన కావాలని పోరాడదాం. ఈ ప్రజాస్వామ్యంలోనే అసమానతలకు పునాది వుందంటే సమానత్వం ప్రాతిపదికన నూతన ప్రజాస్వామ్యాన్ని తెచ్చుకుందాం. అవినీతి రాజ్యమేలుతుంటే, దాన్ని అరికట్టే మార్గాలను అన్వేషిద్దాం.

కానీ, వ్యవసాయరంగం బాగుపడాలనే పేరున కంపనీలకూ, విదేశీ పెట్టుబడులకూ రాజ్యాన్ని అప్పగించలేం కదా? వాల్‌మార్ట్‌నూ, మాన్‌శాంటోనూ తెచ్చి అధికారంలో కూర్చోబెట్టలేం కదా?

ధాన్యం సేకరణ, నిల్వ, సరఫరా, పంపిణీ గురించి రాస్తూ డా॥ జె.పి. ఈ విషయంలో ప్రభుత్వమూ, ప్రభుత్వ రంగ సంస్థలూ (ఎఫ్.సి.ఐ), ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా విఫలమయ్యాయనీ, అవి చాలా అసమర్థంగా వ్యవహరిస్తున్నాయనీ, అవినీతిలో కూరుకుపోయాయనీ, కాబట్టి ఈ బాధ్యతలను అవి ఏ మాత్రమూ ఇక నిర్వహించలేవనీ తీర్పు ఇచ్చేశారు. పైగా గోదాములు, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా తదితర మౌలిక సౌకర్యాల కోసం భారీ పెట్టుబడులు అవసరమనీ, అందుకవసరమైన వనరులు గానీ, నిర్వహణ సామర్థ్యం గానీ ప్రభుత్వానికి లేవని ఆయన నిర్ధారించారు.

కాబట్టి "రైతుల ఆదాయాల్ని మెరుగు పరిచేందుకు, వినియోగదారులకు అందుబాటు ధరల్ని స్థిరీకరించేందుకు, నాణ్యమైన ఆహార సరఫరాకు భరోసా ఇచ్చేందుకు" వ్యవస్థీకృత రిటైల్ వ్యవస్థ అవసరమని ఆయన గట్టిగా అభిప్రాయ పడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో, పార్లమెంటరీ వ్యవస్థలో ప్రభుత్వాల మీదా, ప్రభుత్వరంగ సంస్థల మీదా ఏ రకమైన విశ్వాసమూ లేని ఆయన ఒక రాజకీయ పార్టీని ఎందుకు నడుపుతున్నారో, శాసన సభ్యుడిగా ఎందుకున్నారో, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా ఎందుకున్నారో మనకు ఒక పట్టాన అర్థం కాదు. వాస్తవానికి ఆయన అసెంబ్లీలో కాకుండా ఏ కంపనీ బోర్డులోనో ఉండాలి. రైతు సమాఖ్యలో కాకుండా ఏ ఫిక్కీలోనో, సి.ఐ.ఐ లోనో వుంటే మనం త్వరగా ఆయనను గుర్తించగలం. అర్థం చేసుకోగలం.

రైతులకు మద్ధతు ధరలిచ్చి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో సరుకుల్ని సరఫరా చేసే కంపనీ ఏదయినా ప్రపంచంలో వుందా? సామాజిక న్యాయంతో వ్యవహరించి, లాభాపేక్ష లేకుండా, నాణ్యమైన ఆహార సరఫరా చేసే కంపనీ ఏదైనా ప్రపంచంలో ఉందా?

"ఎలుకల్ని పడుతున్నంత వరకూ పిల్లి నల్లదా? తెల్లదా అనవసరం" నిజమే. కానీ కంపెనీ పిల్లులు లాభాలు మాత్రమే తింటాయనీ, లాభాల కోసమే బతుకుతాయనే స్పృహ మనకుండాలి కదా? విషపూరితమైన, కలుషితమైన ఆహారాన్ని ఇవ్వాళ్టి రిటైల్ చైన్లలో అందమైన పాకెట్లు చేసి, బ్రాండింగ్ చేసి అమ్ముతున్నవి ఈ కంపనీలే కదా? ఆ బ్రాండెడ్ ఉత్పత్తులు తినే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, అనేక నివేదికలు ఘోషిస్తున్నాయి కదా? పైగా మార్కెట్లో స్థిరపడే వరకూ తక్కువ ధరలకే సరుకులూ, సేవలూ అందించే ఈ కంపనీలు, గుత్తాధిపత్యం లభించాక ప్రజల మీద ధరల భారాలు పెంచడాన్ని ప్రపంచమంతా అనుభవించిందే కదా?

నూటికి 70 మంది పేదలున్న దేశంలో, వివిధ సామాజిక దొంతరలు వున్న సమాజంలో ప్రభుత్వాలు పోషించాల్సిన పాత్రను ఎంత పెద్ద కంపనీ అయినా పోషించగలదా? రిటైల్ చైన్లలో కల్పించే ఉపాధి కంటే (పైగా ఆ ఉపాధి అమానవీయమైనది, భద్రత లేనిది) వాటివల్ల దేశ ప్రజలు కోల్పోయే ఉపాధే ఎక్కువని, ప్రపంచంలో వివిధ దేశాల అనుభవాలు కళ్ళముందే ఉన్నాయి కదా?

పైగా ప్రైవేటు కంపనీలు– వాటి పుట్టుక నుంచీ నిర్వహణ వరకూ అంతా అవినీతి మయమేననీ, ప్రభుత్వాధినేతలకూ, అధికారులకూ లంచాలు ఎరచూపి, పనులు చేయించుకునేది ఈ కంపనీలేననీ తాజాగా వాల్‌మార్ట్ (ఇండియా) ఉదంతం నిరూపించింది కదా? రిలయన్స్‌లూ, సత్యంలూ, ఇంకా అనేకానేక కంపనీల చరిత్ర అంతా అదే కదా? ప్రైవేట్ కంపనీల అధిపతులే కదా ఇవ్వాళ అక్రమాల కేసుల్లో జైళ్ళ పాలవుతున్నది. వీళ్ళే కదా పార్లమెంటులోనూ, అసెంబ్లీలలోనూ తిష్టవేస్తున్నది. ఆయా రాజకీయ పార్టీల నాయకులుగా, మంత్రులుగా వ్యవహరిస్తున్నది.

వీళ్ళు నేతృత్వం వహిస్తున్న కంపనీలు, వాటి చైన్లు ఎలా ప్రజలకు మేలు చేస్తాయో, ప్రజల ప్రయోజనాలను ఎలా కాపాడతాయో డా॥ జె.పి. ప్రజలకు వివరించాలి.

## మనం కోరవలసిందేమిటి?

- వాస్తవ సాగుదారులకు సాగు భూమిని అందుబాటులో ఉంచాలి. కౌలుదారులపై నియంత్రణ విధించాలి. వ్యవసాయేతరుల చేతుల్లోకి వ్యవసాయ భూములు వెళ్ళకుండా చట్టం చేయాలి.
- రైతుకు న్యాయమైన గిట్టుబాటు ధర రావాలి. డా॥ స్వామినాథన్ సిఫారసును అమలు చేయడమొక్కటే దానికి మార్గం.
- గోదాములు నిర్మించాలి. శీతల గిడ్డంగులు నిర్మించాలి. కానీ అవి వాల్‌మార్ట్ పెరట్లో కాకూడదు. పెద్ద గ్రామాల మధ్యలో, రైతుల పొలాల మధ్యలో నిర్మించాలి. వాటి నిర్వహణ బాధ్యత స్థానిక ప్రజల సహకార సంఘాలది అయి వుండాలి.
- ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు పెట్టాలి. వాటికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వం సమకూర్చాలి. వాటి నిర్వహణలో స్థానిక ప్రజలను భాగస్వామును చేయాలి. తద్వారా స్థానికంగా ఎక్కడిక్కడ ఉపాధి అవకాశాలను పెంచాలి.
- ఆయా కేంద్రాలనుండి ప్రభుత్వం నేరుగా ఉత్పత్తులను సేకరించాలి. కేవలం బియ్యం, గోధుమలే కాకుండా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కుటుంబానికి అవసరమైన అన్ని సరుకులనూ ప్రభుత్వం అందించాలి.
- నాణ్యమైన ఉత్పత్తులు, విషపూరితం కాని ఆహారం ప్రజలందరికీ అందాలంటే, రసాయన ఎరువుల, పురుగు విషాల వాడకాన్ని పూర్తిగా మానేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులపై అవసరమైన శిక్షణ ఇవ్వాలి. భూసార యాజమాన్యం రైతు బాధ్యతగా కాకుండా, జాతీయ బాధ్యతగా స్వీకరించి, నిధులు కేటాయించాలి. –

- చిన్న కమతాలకు, వివిధ పంటలకు ఉపయోగపడే చిన్న యంత్రాలను గ్రామ సహకార సంఘాలకు సమకూర్చాలి. పంట మిగులును భూమిలో కలిపేసే చిప్పర్లు, రోటోవేటర్లు లాంటివి ఈ సహకార సంఘాల పరిధిలో ఉంచాలి.
- చెరువులను, కుంటలను పునరుద్ధరించాలి. వర్షపునీటి సంరక్షణా పద్ధతులను, సాగునీటి పొదుపు చర్యలను భారీగా చేపట్టాలి. అందుకోసం నిధులు కేటాయించాలి.

ఈ పని ప్రభుత్వాలు చేయాలి. ప్రభుత్వాలు చేసేలా ఒత్తిడి చేయాల్సిన బాధ్యత రైతు సంఘాలది. ప్రజలది. ఈ బాధ్యతనొదిలేసి, కంపనీలకు మన భవిష్యత్తును అప్పగించాలనుకోవడం చాలా ప్రమాదం.

"తన కుటుంబానికి ఆహార భద్రత, తన అవసరాలకు ఆదాయ భద్రత"– ఇది మాత్రమే సన్న, చిన్న కారు రైతులు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీసుకోవలసిన బాధ్యత. దేశ ఆహార భద్రత గురించి ఆలోచించవలసింది ఖచ్చితంగా ప్రభుత్వమే.

ప్రస్తుతం దేశ ఆహార భద్రత పేరుతో "వ్యవసాయ ఆధారిత పారిశ్రామిక వర్గాలకు చౌకగా ముడిసరుకులు అందించడం, పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు చౌక వేతనాలకు దొరికేలా చేసేందుకు, ఆహార ఉత్పత్తుల పై ధరల నియంత్రణ విధించడం" లాంటి పనులు ప్రభుత్వాలు చేస్తున్నాయి. దీని కోసం రైతుకు ఇవ్వాల్సిన న్యాయమైన మద్దతు ధరలు ఇవ్వకుండా అదుపు చేస్తున్నాయి. ఎగుమతి, దిగుమతి విధానాల్లో మార్పులు కూడా దేశ పారిశ్రామిక వర్గాల, ఎగుమతి వ్యాపారుల ప్రయోజనాల మేరకే జరుగుతున్నది.

రైతుకు న్యాయమైన మద్ధతు ధర ఇచ్చి ప్రభుత్వాలు పంట ఉత్పత్తులను సేకరించాక, వాటిని నిల్వ చేసుకుంటాయా? కుళ్ళ బెట్టుకుంటాయా? చౌక ధరలకు వినియోగదారులకు అందిస్తాయా? విదేశాలకు ఎగుమతి చేస్తాయా? అన్నది విచక్షణతో నిర్ణయించుకోవలసింది ప్రభుత్వాలే. తన కుటుంబ అవసరాలకు ఉంచుకుని మిగిలిన ఉత్పత్తిని రైతు ప్రభుత్వానికిచ్చేశాక, అది ఏమవుతుందన్నది వ్యక్తిగా రైతుకు అనవసరమైన విషయం. "పంటల ఎగుమతులకు అనుమతించండి" అని డిమాండ్ చేయాల్సిన బాధ్యత రైతుది కాదు.

రైతులు, రైతుసంఘాలు డిమాండ్ చేయవలసింది "పంటల ఉత్పత్తి క్రమంలో అవసరమైన మద్ధతును అందించమనీ, పంటను మద్ధతు ధరలిచ్చి కొనమనీ" మాత్రమే.

ఎవరి ప్రయోజనాలకోసం వారు పోరాడాలి. కంపనీల పక్షాన కాకుండా రైతు సమాఖ్యలు రైతుల పక్షాన పోరాడాలి. అప్పుడే వ్యవసాయం బాగుపడుతుంది. రైతుకు న్యాయం జరుగుతుంది.

తేది: 29-11-2012

**– కె.రవి**

**సహసంపాదకులు, తొలకరి**